# కంచెలో జాగ్రత్త

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"ఏమిటో...తప్పనిసరి కనుక పెళ్లికి వెళ్తున్నానుగానీ ధన్యను వంటరిగా వదిలి వెళ్లాలంటే దిగులుగా వుంది" తన ముందున్న బల్లమీద ఫైళ్లను అనాసక్తంగా తిరగేస్తూ అంది కరుణ.

"అదేమిటి.. చిన్నపిల్ల. నిండా పధ్నాలుగేళ్లు లేవు. దాన్ని ఒక్కత్తినీ ఇంట్లో వదిలి వెళ్లడం దేనికి? రాత్రికి మళ్లీ వచ్చేస్తారా?" ఆశ్చర్యంగా అడిగింది కరుణ పక్క సీటులో వున్న ప్రసూన.

"పెళ్లి ముహూర్తం రేపు తెల్లవారుజామున. మధ్యాహ్నం పర్మిషన్ పెట్టి వెళ్తున్నా. మా పెద్దమ్మ కూతురి కూతురి పెళ్లి. వెళ్లకుండా ఉండలేను. ధన్యకు ఆదివారం స్కూల్లో లెక్కల ఒలంపియాడ్ పోటీ పరీక్ష ఉంది. ఈ జిల్లాలోని పాఠశాలల నుండి ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారు. వీళ్ల స్కూలు తరఫున ధన్య ఎంపికైంది. ఈ పోటీలో నెగ్గితే రాష్ట్రస్థాయి పోటీకి పంపిస్తారు. తను ఈ పరీక్ష రాసి తీరాలని పట్టుబట్టి కూర్చుంది. 'నాకేం భయం లేదమ్మా. పక్కనే అద్దెకున్నవాళ్లు వాళ్లున్నారుకదా' అంటుంది" చేతిలో వున్న పెన్ను విసుగ్గా బల్లమీద పడేసి అంది కరుణ.

కరుణ, ప్రసూన రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో పని చేస్తున్నారు. పదేళ్లుగా అదే చోట కదలకుండా బదిలీల బెడద లేకుండా నెగ్గుకొస్తున్నారు.

ఒకరిమీద మరొకరు అసూయపడే పరిస్థితులు లేవు కనుక కష్టసుఖాలు చెప్పుకోవడమే కాకుండా అవసరానికి ఒకరికొకరు సహాయపడుతుంటారు కూడా.

"పోనీ ధన్యను మా ఇంట్లో వదిలేసి వెళ్లు. ఒక్కరోజేగా" మనస్ఫూర్తిగా అంది ప్రసూన.

కరుణ కృతజ్ఞతను తెలుపుతున్నట్లు ప్రసూన చేయి నొక్కి అంది.

"మీకు తెలుసుగా. ధన్యకు చాలా మొహమాటం. అందులో పరీక్ష ముందురోజు కొత్త పరిసరాల్లో ఇక అస్సలు చదవలేదు" అంది.

"ఆ మాట ముందే నువ్వు అనేయడం దేనికి? ధన్యను అడిగి ఏమందో సాయంత్రం నాకు ఫోన్ చేయి" అంది ప్రసూన.

ప్రసూనకూ ఇద్దరూ కొడుకులే. ఒకడు హైదరాబాద్‌లోనూ, చిన్నవాడు వరంగల్‌లోనూ చదువుకుంటున్నారు.

ఆవిడ కరుణ కన్నా ఆరేళ్లు పెద్దది. అందుకే చనువుగా కరుణను నువ్వు అనేస్తుంటుంది. కరుణ మాత్రం ఆవిడను మీరు అని మన్నిస్తుంది.

సాయంత్రం బస్సులో నంద్యాలకు బయలుదేరుతున్నారు కనుక కాస్త ముందుగా ఇంటికి వచ్చేసింది కరుణ.

ఆవిడ వచ్చేసరికి ఆమె భర్త కిషన్‌రావు అసహనంగా ఎదురుచూస్తున్నాడు.

గబగబా లోపలకు వెళ్లి ముఖం కడుక్కుని తయారైంది కరుణ.

"ధన్యా! ప్రసూన ఆంటీవాళ్లు ఇంట్లో వచ్చి ఉండమన్నారు నిన్ను. ఒక్కరోజుకేగా. నువ్విక్కడ ఒంటరిగా వుంటే అక్కడకు వెళ్లినా నాకు మనశ్శాంతి ఉండదు. మాతోపాటు బయల్దేరితే నిన్ను ప్రసూనగారింట్లో వదిలి వెళ్తాము" స్కూలు నుండి వచ్చిన కూతురికి బోర్నవిటా కలిపి ఇస్తూ అనునయంగా అంది కరుణ.

"అమ్మా! నాకక్కడ చదువుమీద ఏకాగ్రత కుదరదు. నాకేం భయంలేదని చెప్పానుగా. పక్క వాటాలో వాళ్లను పిలిస్తే పలుకుతారు. నా గురించి అనవసరంగా దిగులు పడకమ్మా" అనేసి పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది ధన్య.

'మొండిపిల్ల... మాట వినే రకమయితేగా?' అని సణుక్కుంటూ తను బట్టలు సర్దుకున్న చిన్న సూట్‌కేసు బయటకు మోసుకొచ్చింది కరుణ.

అదే సమయంలో ఇంటి ముందు ఆటో ఆగడం, ఆటోలో నుండి కిషన్‌రావు బంధువు శివరావు దిగడం జరిగింది.

"రా శివా! ఏంటి సంగతి? ముందు చెప్పకుండా వచ్చేసావు" అంటూ ఆహ్వానించాడు కిషన్‌రావు.

కరుణ కూడా "బాగున్నారా?" అని పలకరించింది అతన్ని.

"కోర్టు వ్యవహారం మీద ఒకతన్ని కలవాలని వచ్చాను. అతను రేపు తప్పితే దొరకడు. ఎల్లుండి మళ్లీ వెళ్లిపోవాలి. మీరేమిటి ఎక్కడికో ప్రయాణం పెట్టుకున్నట్టున్నారు?" వాళ్ల పెట్టె, బ్యాగు చూసి అడిగాడు శివరావు.

"నంద్యాలలో మా వదినగారు అంటే కరుణ అక్క కూతురు పెళ్లి. ధన్య లెక్కల ఒలంపియాడ్ కోసం వాళ్ల స్కూల్ తరఫున పరీక్ష రాస్తోంది కనుక పెళ్లికి రానని వుండిపోయింది" కిషన్‌రావు చెప్పాడు వాచీ చూసుకుంటూ.

"మీరు మంచి సమయానికి వచ్చారు. ధన్యను ఒంటరిగా వదిలి వెళ్లాలంటే దిగులుగా ఉంది. మీరు వుంటారు కనుక నాకు ఇక నిశ్చింత. అయితే రేపు మీకు హోటల్ భోజనం మాత్రం తప్పదు" మనసు తేలిక పడగా సరదాగా మాట్లాడింది కరుణ.

"నేనేం పరాయివాడినా మర్యాదలు జరిపించలేకపోయామని మీరు బాధపడడానికి? మీరు



నిశ్చింతగా వెళ్లిరండి. ధన్యకు తోడుగా నేనుంటాను'' అన్నాడు శివరావు.

"మీ బంధువుల్లో నా కూతురికి తగిన కుర్రవాడు ఎవరైనా ఉంటే చూడమ్మా. డిగ్రీ పూర్తి కావడం, ఉద్యోగం రావడం రెండూ ఒకేసారి కలిసివచ్చాయి. ఇక పెళ్లి కూడా కుదిరితే మేము గట్టెక్కుతాం'' మళ్లీ తానే అన్నాడు శివరావు.

"తప్పకుండా కనుక్కుంటాను'' అనేసి లోపలకు వెళ్లింది కరుణ కాఫీ కలిపి అతనికి ఇచ్చి వెడదామన్న ఉద్దేశ్యంతో.

"అమ్మా! నేనూ మీతో పాటు పెళ్లికి వస్తాను. నాకు ఈ పరీక్ష రాయాలని లేదు'' అంటూ గబగబా లోపలకు వచ్చి తన బట్టలు రెండు బ్యాగులో కుక్కుకుని తయారయింది ధన్య.

"అదేమిటే? జిల్లా స్థాయిలో ఖచ్చితంగా నువ్వే ఎంపిక అవుతావనీ, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడమే ఒక గౌరవమనీ మీ టీచర్ మరీ మరీ చెప్పిందన్నావు. మరేంటి నువ్విలా మాతోపాటు ఇప్పుడొస్తానంటున్నావు'' కరుణ ఆశ్చర్యంగా చూసి అడిగింది.

"నాకు ఈ పరీక్ష రాయాలని లేదు'' అంది ధన్య మొండిగా.

"అమ్మలూ! నీకోసం నేనే ఏరేరి ఈ డ్రెస్ కొన్నాను. ఎలా వుంది?''

లోపలికి వచ్చిన శివరావు పెట్టెలోనుండి సిల్కు చుడీదార్ బయటకుతీసి ధన్యకు చూపించి చనువుగా ఆ పిల్ల రెండు భుజాలు పట్టుకుని బొమ్మకు పెట్టినట్లు ఆ డ్రెస్‌ను ధన్యకు పెట్టి చూపాడు.

"బావుంది అంకుల్...థాంక్యూ'' అని దూరం జరిగింది ధన్య.

ఆ సమయంలో లోపల బ్యాగ్ సర్దుకుంటున్న కిషన్ రావు దగ్గరకు వెళ్లి ధన్య పరీక్ష రాయనంటోందని, తమతో ఊరికి వస్తానని పట్టుబడుతోందని నెమ్మదిగా చెప్పింది కరుణ.

అసలే టైమైపోతున్నదన్న చిరాకులో వున్న కిషన్‌రావుకు ఒళ్లు మండింది ఈ కొత్త మెలికతో. కూతురు ఈ పోటీలో నెగ్గుతుందని అతని నమ్మకం.


"ధన్యా ఇలారా" అంటూ కూతుర్ని పిలిచాడు. "చిన్నపిల్లలా ఏమి టమ్మా ఈ మంకుతనం? ఈరోజుదాకా రమ్మని బ్రతిమాలితే రానన్నావు. ఇప్పుడు వస్తానంటున్నావుట? నీమాట మీద నేను మీ టీచర్‌కు చెప్పేసాను నువ్వు పోటీలో తప్పకుండా పాల్గొంటున్నావని. ఇంకేం చెప్పడానికి ప్రయ త్నించవద్దు. ఇంట్లో ఉండి బుద్ధిగా చదువుకో. అమ్మ రాత్రికి వంట చేసింది. అది మీ ఇద్దరికీ సరిపోతుంది. రేపు సాయంత్రానికల్లా మేము ఇక్కడ ఉంటాము. సరేనా. " అని ఖచ్చితంగా చెప్పేసి బయటకు నడిచాడు కిషన్‌రావు. .

దెబ్బతిన్న పావురంలా చూస్తున్న కూతుర్ని దగ్గరకు తీసుకుని "బంగారు తల్లిగా.. పరీక్ష బాగా రాయి. సరేనా?" అంటూ బయల్దేరింది



## పెళ్లికూతురవుతున్న సంగీత!

సంగీత పెళ్లి గురించిన వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నా వాటిని ఖండిస్తూ వచ్చిందామె. అయితే యువగాయకుడు గిరీష్‌తో ఆమె ప్రేమా యణం పెళ్లి వరకూ వచ్చినట్టేనట. ఈ సంగతిని స్వయాన గిరీషే ఒప్పుకు న్నట్టు చెన్నయ్ వార్తలు చెబుతున్నాయి. 2009 ఫిబ్రవరిలో సంగీత-గిరీ ష్‌ల పెళ్లి జరుగుతుంది. ఇప్పుడిప్పుడే గాయకుడిగా తమిళనాట పేరు తెచ్చుకుంటున్న గిరీష్‌కి హీరోగా మారాలనే కోరిక వుందిట. ఒకవేళ ఇద్దరి పెళ్లి అయ్యాక సంగీత సినిమాలకు గుడ్‌బై చెప్పడం, గిరీష్ హీరోగా మారడం జరుగుతాయేమో!



కరుణ.

మూడుగంటల బస్సులో బయల్దేరాలనుకున్న ఆ దంపతులకు జరిగిన ఆలస్యం మూలాన అయిదుగంటల బస్సు దొరికింది.

టిక్కెట్లు తీసుకుని బస్సులో కూర్చోగానే ప్రసూనకు ఫోన్ చేసింది కరుణ.

అనుకోకుండా కిషన్‌రావు బంధువు ఇంటికి రావడం, ఆఖరి నిముషంలో ధన్య మనస్సు మార్చుకుని పెళ్లికి వస్తానని మొండికేయడం, తాము కోప్పడ్డం అన్నీ ఆవిడకు చెప్పింది.

"సరే కరుణా! మీరు సంతోషంగా వెళ్లిరండి. నేను ఆఫీసు నుండి వెళ్లేట ప్పుడు మీ ఇంటికి వెళ్లి ధన్యను పలకరించి వెళతాను. ఇక దీని గురించి మీరేమీ ఆలోచించకండి" అన్నదామె.

***

తను ఇంటికి రావడం ఆలస్యమవుతుందని కరుణ వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని భర్తకు ఫోన్ చేసి చెప్పి ఆఫీసు నుండి తిన్నగా కరుణ ఇంటికి బయల్దేరింది ప్రసూన.

ఆవిడ వచ్చేసరికి బయట వరండాలో కూర్చుని ఉంది ధన్య. ఏదో అల జడికి లోనయినట్లు అటూ ఇటూ చూస్తూ ఉండడం అంతలోనే గమనిం చింది ప్రసూన.

కొత్త సిల్కు చుడీదార్‌లో వుంది ధన్య.

ఆవిడను చూడగానే "ఆంటీ" అంటూ దగ్గరకు వచ్చి ఎప్పుడూ అలవా టులేని విధంగా భుజంమీద తలవాల్చింది ధన్య. ఆ పిల్ల గుండె వేగంగా కొట్టుకుంటోంది.

"అప్పుడే అమ్మమీద దిగులు పెట్టుకున్నావా? మరి నువ్వెంతో ధైర్యంగలదానివని చెప్పుందే మీ అమ్మ. మరేంటి ఇలా... అదిసరేగానీ నువ్వు ఇంట్లో వున్నప్పుడు నైటీ వేసుకుంటావుగా? కొత్త చుడీదారు ఎప్పుడు కొన్నది మీ అమ్మ?" ప్రేమగా ఆ పిల్లను దగ్గరకు తీసుకుంటూ అడిగింది ప్రసూన.

"ఈ డ్రెస్ అంకుల్ తెచ్చారు. వేసుకుని చూపించమన్నారు" అప్రియ మైన విషయం చెప్తున్నట్లు అంది ధన్య "నేను కొంచెం లావయ్యానా ఆంటీ? ఇక్కడ కాస్త బిగుతుగా కనిపిస్తోందని అన్నారు అంకుల్" నడుము క్రింది భాగాన్ని చూపుతూ అడుగుతున్న ధన్య ముఖం మనసుకు నచ్చని సంగతి గుర్తుకువచ్చినట్లు కాంతి తగ్గింది.

ఆ విషయం ప్రసూన సూక్ష్మబుద్ధిని దాటిపోలేదు.

"సరే పద. బట్టలు మార్చుకో. మీ అంకుల్ వచ్చారని నాకు తెలియదు కదా. అందుకని ఇవాళ రాత్రికి నీకు తోడుగా ఉందామని వచ్చాను" అంది ప్రసూన ధన్య భుజాలు చుట్టూ చేయివేసి లోపలకు వస్తూ.

"నిజంగానా ఆంటీ? మీరు దగ్గరుంటే అమ్మ వున్నట్లే వుంటుంది" అంది ధన్య వెలిగిపోతున్న కళ్లతో చూస్తూ.

"అంకుల్! ఈమె మా అమ్మ ఫ్రెండ్. అమ్మ పనిచేసే ఆఫీసులోనే పని చేస్తారు. నేను ఒంటరిగా ఉన్నానేమో అని తోడుగా వచ్చారు" అంటూ శివ రావుకు పరిచయం చేసింది.

"నమస్తే" అన్నాడు శివరావు. "ఈ పిల్ల అన్నం తిననని మారం చేస్తుందో, రాత్రంతా చదువుకుంటానని కూర్చుంటుందో ఎలాగో అనుకుం టున్నాను. మీరు తోడుగా వుంటారు కనుక నా బాధ్యత తగ్గింది" అన్నాడు.

కొద్దిగా చెంపల దగ్గర నెరిసిన జుత్తు, మంచి ఛాయగల శరీరం, చక్కని ఆకారంతో సౌమ్యంగా, పెద్ద మనిషి తరహాలో వున్న శివరావు చిరునవ్వుతో

నమస్కరించింది ప్రసూన.

ధన్య బట్టలు మార్చుకోవడానికి వెళ్లినప్పుడు తను బయటకువెళ్లి భర్తకు ఫోన్ చేసి తను ఈ రాత్రికి ధన్యకు తోడుగా ఉంటున్నట్లు చెప్పింది ప్రసూన.

***

ఆదివారం పరీక్ష అయిపోయాక ధన్యను తమ ఇంటికి తీసుకువెళ్లింది ప్రసూన.

"ఇప్పుడు చెప్పు ధన్యా. ముందు పెళ్లికి వెళ్లను, పరీక్ష రాస్తాను అని పట్టుదలగా వున్నదానివి ఉన్నట్టుండి నేనూ పెళ్లికి వస్తాను, పరీక్ష రాయను అని అమ్మతో అన్నావుట. ఎందుకని?" అనడిగింది ఆ పిల్ల సేద తీరాక దగ్గరకు తీసుకుని.

"ఆ అంకుల్‌తో ఒంటరిగా ఉండడం నాకిష్టంలేదాంటీ. కొంచెం విచిత్రంగా ప్రవర్తిస్తారు. పోయినసారి వచ్చినప్పుడు అమ్మానాన్నా ఏదో పని మీద బయటకు వెళ్లినప్పుడు సడెన్‌గా వచ్చి నా ఒళ్లో తల పెట్టి పడుకున్నారు. 'నాకెందుకో ఇవాళ చాలా దిగులుగా ఉంది. చనిపోయిన మా చెల్లెలు గుర్తుకువస్తోంది. నీ ఒళ్లో పడుకుంటే హాయిగా ఉంది' అంటూ నా ఛాతీకి ముఖం ఆన్చారు. నాకు ఆ స్పర్శ అస్సలు నచ్చలేదు. గభుక్కున సోఫాలో నుండి లేచి వెళ్లిపోయాను. నిన్న కూడా తను తెచ్చిన డ్రెస్ వేసుకొమ్మని బలవంతపెట్టి వేసుకుని వచ్చాక 'ఈ నాలుగు నెలల్లో ఇంకాస్త ఎదిగావు. ఇక్కడ బిగుతుగా ఉంది' అంటూ హిప్స్‌మీద చేయివేసి నిమిరారు" గుండెల్లో లావా బయటకు తన్నుకు వచ్చినట్లు గబగబా చెప్పింది ధన్య. ఆ పిల్ల ముఖం ఎర్రగా కందిపోయింది.

"మరి అమ్మతో అప్పుడే చెప్పలేకపోయావా?" ధన్య తల నిమురుతూ అడిగింది ప్రసూన.

"ఇలాంటివి చెప్తే ఏమంటారో అని భయమేసింది ఆంటీ. మా నాన్నకు దగ్గర బంధువు కదా" కళ్లతో నీళ్లు తిరుగుతుండగా తల వంచుకుంది ధన్య.

"నువ్వు చాలా జాగ్రత్తగలదానివి ధన్యా. కానీ అమ్మ దగ్గర ఇటువంటి విషయాలు దాచకూడదు" అంది ప్రసూన.

"థాంక్స్ ఆంటీ. మీరు రావడంవలన పరీక్ష బాగా రాసాను" అంది ధన్య తేరుకుంటూ.

***

మర్నాడు కరుణ ఆఫీసుకు రాగానే ప్రసూన వెళ్లి ఆమె ప్రక్కన కూర్చుంది.

"శివరావు వెళ్లిపోయాడు. రాత్రి ధన్య అంతా చెప్పింది ప్రసూనా. ఆ పిల్ల మొండి చేస్తోంది అనుకున్నానుగానీ మీలాగా కారణం అడగలేదు నేను. బంధువులేకదా, పిల్లకు తోడుగా ఉంటాడనే అనుకున్నానుగానీ..." అంటూ ఉద్వేగంగా అంది.

"కాలం మారింది కరుణా. మనం ఆడపిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. పసిపిల్లలనే పాడు చేసే పశుప్రవృత్తి కొందరిలో చోటు చేసుకుంటున్న కలికాలం ఇది. ప్రమాదం ఎటువైపు నుండి వస్తుందో చెప్పలేని పరిస్థితి. స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగు... ఎవరు ఎలాంటివారో తెలుసుకోవడం కష్టంగా ఉంది. ధన్యకు కాస్త వయస్సు వస్తోంది కనుక అతని ప్రవర్తనలో తేడా గమనించింది. ఇంకా చిన్న పిల్లలయితే అదీ తెలియదు. పాపం...అంకుల్, మామా అంటూ అమాయకంగా మీదకెక్కి కూర్చుంటారు. చిన్నప్పటినుండే ఇకపై మనం పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ లాంటి విషయాలు నేర్పాలి. అలాగే వాళ్లకు కాపలాగా, తోడుగా కంచెలాగా మనం పెడుతున్న వ్యక్తుల గురించి జాగ్రత్త పడాలేమో! కంచె చేను మేయకుండా రక్షణ ఏర్పాట్లు కూడా చేసుకోవాలనుకుంటాను. ఇటువంటి వ్యక్తుల వికృత చేష్టలు చిన్నపిల్లల మనస్సులను గాయపరుస్తాయి. ఈ జ్ఞాపకాలు వారి వ్యక్తిత్వం మీద ఎటువంటి ప్రభావం చూపిస్తాయో ఊహించలేము. కంచెతో జాగ్రత్తగా ఉండకపోతే జీవితాంతం వెంటాడే చేదు అనుభవాలు మిగిలిపోతాయి" అంటూ కళ్లు మూసుకుంది ప్రసూన.

ప్రసూన రెప్పల వెనుక దాగిన తడి అటువంటి చేదు అనుభవాల జ్ఞాపకమా అన్న ప్రశ్న కరుణ మనసులో మెదిలి మాయమైంది.

మాట రానట్టు ప్రసూన చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా వత్తింది కరుణ.

★



## బుర్రలేని గుర్రం

అమెరికాలోని వర్జీనియాలో ఒక పొలంలో గడ్డి తింటున్న గుర్రం తీరి కూర్చుని చీలిన చెట్టు మధ్య తన తల దూర్చి ఇరుక్కుపోయి హాహాకారాలు చేసింది. అదృష్టవశాత్తు పక్క పొలంలో పని చేసుకుంటున్న వ్యక్తి దాని కేకలు విని పరుగెత్తుకొచ్చి చూసి వెంటనే ఎవరి కోసమూ చూడకుండా తన దగ్గరున్న చెయిన్ రంపాన్ని తెచ్చి ఆ చెట్టును జాగ్రత్తగా కోసి దాని ప్రాణాలు కాపాడాడు.

-తటవర్తి

